సాక్షి కర్నూలు

ఆదివారం । 24 । సెప్టెంబర్ । 2023



అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి శనివారం కామారెడ్డికి చెందిన వెంగళరెడ్డి రూ.1,00,500 విరాళంగా అందజేశారు.



350 క్యూసెక్కులు విడుదల

జూపాడుబంగ్లా: లాకిన్స్‌లా నుంచి తూడిచెర్ల సబ్ చానల్ కాల్వకు శనివారం 350 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస నాయక్ తెలిపారు.



వందేభారత్‌కు స్వాగతం

జిల్లా ప్రజలను ఊరిస్తున్న వందేభారత్ రైలు ఆదివారం నుంచి పట్టాలు ఎక్కనుంది. కాచిగూడ - యశ్వంత్‌పూరు మధ్య నడిచే ఈ రైలు కర్నూలు మీదుగా వెళ్లనుంది. 8లో▸

న్యూస్‌రీల్

27న ప్రపంచ పర్యాటక దినోత్సవం



పి.విజయ

కర్నూలు కల్చరల్: జిల్లా పర్యాటక సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఈనెల 27న ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు జిల్లా పర్యాటక సాంస్కృతిక శాఖ అధికారి పి.విజయ తెలిపారు. శనివారం ఆమె 'సాక్షి'తో మాట్లాడుతూ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. విజేతలకు ఈ నెల 27న సాయంత్రం 5 గంటలకు సిల్వర్ జూబ్లీ కళాశాలలో నిర్వహించే పర్యాటక దినోత్సవ వేడుకల్లో అతిథుల చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజనతో పాటు జిల్లాలోని ప్రజా ప్రతినిధులు అతిథులుగా హాజరవుతారన్నారు. వేడుకల్లో భాగంగా ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు.

25లోగా పెండింగ్ దరఖాస్తులను పంపండి

కర్నూలు(అర్బన్): నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో పెండింగ్ దరఖాస్తులను ఈ నెల 25లోగా జిల్లా నోడల్ అధికారి లాగిన్‌కు పంపాలని మైనారిటీ సంక్షేమ శాఖ అధికారిణి సబీహా పర్వీన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించి చేపట్టిన ఈ ప్రక్రియలో బయోమెట్రిక్ అథెంటికేషన్ పూర్తయిన విద్యార్థులు ఆన్‌లైన్ దరఖాస్తులను విద్యా సంస్థల లాగిన్‌లలో పరిశీలించి పంపాలన్నారు. మరింత సమాచారం కోసం హనుమంతరావు(9059446377), వేణు(9885488088), మహబూబ్‌బాషా (9848864449)లను సంప్రదించాలని పేర్కొన్నారు.

30న ఢిల్లీకి 'స్థానిక' ప్రజా ప్రతినిధులు

కర్నూలు(అర్బన్): జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆధ్వర్యంలో జిల్లాలోని మూడు మండలాలకు చెందిన స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు ఈ నెల 30న ఢిల్లీకి వెళ్లనున్నట్లు జిల్లా పరిషత్ సీఈఓ జి.నాసరరెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఢిల్లీలో జరగనున్న ఆస్పిరేషన్ బ్లాక్స్ ప్రోగ్రామ్‌లో పాల్గొనేందుకు భారత ప్రభుత్వం జిల్లాలోని మద్దికెర, హొళగుంద, చిప్పగిరి మండలాలను ఎంపిక చేసిందన్నారు. ఈ కార్యక్రమానికి ఒక్కో మండలం నుంచి ఐదుగురు సర్పంచులు, ఎంపీపీ, ఎంపీడీఓ(మొత్తం మూడు మండలాల నుంచి 21 మంది) హాజరవుతారని, వీరితో పాటు జెడ్పీ సీఈఓ కూడా ఉండాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారన్నారు. కార్యక్రమాన్ని దేశ ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభిస్తారన్నారు. భారత ప్రభుత్వం ఆధ్వర్యంలోని సంకల్ప్ సప్త్ కార్యక్రమంలో భాగంగా గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధిని ఆశించి(విద్య, వైద్యం, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, ప్రజల జీవన ప్రమాణాలు తదితరాలు) చేపట్టాల్సిన విధి విధానాలను ఈ కార్యక్రమంలో వివరిస్తారన్నారు.


ముమ్మరంగా మల్టీపర్పస్ గోదాముల నిర్మాణాలు

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో మల్టీపర్పస్ గోదాముల నిర్మాణం వేగవంతం చేసినట్లు జిల్లా మార్కెటింగ్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సుబ్బారెడ్డి శనివారం విలేకరులకు తెలిపారు. మొత్తం 227 మల్టీపర్పస్ గోదాములు నిర్మిస్తుండగా.. ఇప్పటి వరకు నంద్యాల జిల్లాలో 9 గోదాములను పీఏసీఎస్‌లకు అప్పగించామన్నారు. వారం రోజుల్లో మరో తొమ్మిది గోదాములను స్వాధీనం చేస్తామన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 1.51 లక్షల టన్నుల సామర్థ్యం కలిగిన బహుళ అవసరాల గోదాములు నిర్మిస్తోందన్నారు. కర్నూలు జిల్లాలో రూ.46.05 కోట్ల వ్యయంతో 95 గోదాములు.. నంద్యాల జిల్లాలో రూ.75.2 కోట్లతో 132 గోదాములు నిర్మిస్తున్నట్లు చెప్పారు. మల్టీపర్పస్ గోదాముల నిర్మాణాలను ఈ ఏడాది నవంబర్ నెలాఖరు లోపు వంద శాతం పూర్తి చేసి పీఏసీఎస్‌లకు అప్పగిస్తామన్నారు.

ప్రశాంత వాతావరణంలో అద్భుతమైన విద్య

ట్రిపుల్‌ఐటీ డీఎంలో పండుగలా స్నాతకోత్సవం

- 117 మంది విద్యార్థులకు పట్టాల అందజేత
- ఒకే విద్యార్థినికి మూడు బంగారు పతకాలు
- డిజైన్, మ్యానుఫ్యాక్చరింగ్ గ్రాడ్యుయేట్స్‌కు ఉజ్వల భవిష్యత్
- అనతికాలంలో ట్రిపుల్‌ఐ టీడీఎం అభివృద్ధిపై ప్రశంసలు
- సైయంట్ లిమిటెడ్ వ్యవస్థాపక ఛైర్మన్ డాక్టర్ బీవీఆర్ మోహన్‌రెడ్డి




ప్రసంగిస్తున్న సైయంట్ వ్యవస్థాపక ఛైర్మన్ డాక్టర్ బీవీఆర్ మోహన్‌రెడ్డి



స్నాతకోత్సవంలో పట్టాలు అందుకున్న ఆనందంలో విద్యార్థులు

కర్నూలు సిటీ: నగర శివారులోని జగన్నాథగట్టుపై ఉన్న భారత సమాచార సాంకేతిక రూపకల్పన మరియు తయారీ సంస్థ(ట్రిపుల్‌ఐ టీడీఎం) ఐదవ స్నాతకోత్సవం సంబరంగా సాగింది. విద్యార్థులు ఉత్సాహంగా డిగ్రీ పట్టాలు అందుకుని ఆనందాన్ని తల్లిదండ్రులు, మిత్రులతో పంచుకున్నారు. జ్ఞాపకంగా సెల్ఫీలు తీసుకుంటూ సందడి చేశారు. క్యాంపస్‌లో కొత్తగా నిర్మించిన కృష్ణ సెమినార్ హాలులో శనివారం ఆ సంస్థ డైరెక్టర్ డాక్టర్ డీవీఎల్ఎన్ సోమయాజులు అధ్యక్షతన స్నాతకోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా సైయంట్ వ్యవస్థాపక ఛైర్మన్, ఐఐటీ (హైదరాబాదు), ఐఐటీ (రూర్కీ), ఎడ్యుకేషన్ కౌన్సిల్ ఛైర్మన్, సీఐఐ, టి-హబ్ వ్యవస్థాపక డైరెక్టర్ డాక్టర్ బీవీఆర్ మోహన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ సమాచార సాంకేతిక రూపకల్పన, తయారీ సంస్థ (ట్రిపుల్‌ఐ టీడీఎం) సమాచార సాంకేతిక, డిజైన్, తయారీపై దృష్టి సారించడంలో ప్రత్యేకమన్నారు. కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్, మెకానికల్ ఇంజినీరింగ్, డిజైన్ అంశాలతో కూడిన కరికులమ్ అద్భుతమని పేర్కొన్నారు. ప్రశాంత వాతావరణంలో ఏర్పాటైన ఈ క్యాంపస్‌లో చదువుతున్న విద్యార్థులు చాలా అదృష్టవంతులన్నారు. సరికొత్తగా కరికులమ్‌తో విస్తృత శ్రేణి నైపుణ్యాలు, వివిధ విభాగాల పరస్పర అనుసంధానంపై విస్తృత అవగాహనతో కూడిన సమగ్ర విధానాన్ని అందిస్తుందన్నారు. 21వ శతాబ్దపు వాస్తవ ప్రపంచ సవాళ్లను ఎదుర్కొనేలా సిద్ధం చేస్తుందన్నారు. ప్రస్తుతం నాల్గవ పారిశ్రామిక విప్లవం నడుస్తుందని, మానవ ప్రగతి పథాన్ని రూపొందించడంలో పారిశ్రామిక విప్లవాలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు.



మూడు బంగారు పతకాలు సాధించిన సాయి దీప్తి లహరిని అభినందిస్తున్న డైరెక్టర్ డాక్టర్ సోమయాజులు

117 మందికి పట్టాలు.. ఐదుగురికి బంగారు పతకాలు

ట్రిపుల్‌ఐ టీడీఎంలో 116 మంది బీటెక్, ఒకరు ఎంటెక్ విద్యార్థులకు పట్టాలను అందజేశారు. అదే విధంగా ట్రిపుల్‌ఐ టీడీఎం లెవెల్‌లో అత్యధిక సంచిత గ్రేడ్ పాయింట్ యావరేజ్ (సీజీపీఏ) సాధించిన కె.సాయి దీప్తి లహరికి ఇనిస్టిట్యూట్ ఆఫ్ గోల్డ్ మెడల్, కంప్యూటర్ సైన్స్‌లో కూడా అత్యధిక సీజీపీఏ సాధించినందుకు మరో గోల్డ్ మెడల్‌ను, బాలికలలో టాపర్‌గా నిలిచిన అమ్మాయికి ఇచ్చే దుర్వాసుల మాణిక్యంబ ఎండోమెంట్ గోల్డ్ మెడల్‌ను సైతం అందజేశారు. ఈసీఈ బ్రాంచ్‌లో ఎస్.ప్రవల్లిక, మెకానికల్ బ్రాంచ్‌లో డీవీ హర్ష తేజ గోల్డ్ మెడల్స్ అందుకున్నారు.




బంగారు పతకాలతో ఎస్. ప్రవల్లిక, డీవీ హర్షతేజ

ఉత్తమ ఫ్యాకల్టీతోనే గుర్తింపు

అనతి కాలంలో ట్రిపుల్‌ఐ టీడీఎంకు మంచి గుర్తింపు దక్కింది. ఇందుకు పటిష్టమైన నాయకత్వ బాధ్యతలు చేపట్టిన డైరెక్టర్‌తో పాటు ఉత్తమ ఫ్యాకల్టీలే కారణం. ఇంజినీరింగ్ విద్యలో అత్యంత కీలకమైన కోర్సులు ఒకే చోట ఉండడం, అత్యుత్తమమైన ఫ్యాకల్టీ ఉండడంతో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు.

– ట్రిపుల్‌ఐ టీడీఎం ఛైర్మన్ ప్రొఫెసర్ హెచ్.ఎ రంగనాథ్

ఐదేళ్లలో విశేష అభివృద్ధి

ట్రిపుల్‌ఐటీ డీఎం ఐదేళ్లలో విశేష అభివృద్ధి సాధించింది. ఇక్కడి విద్యార్థులు మంచి వేతనాలతో క్యాంపస్ ఉద్యోగాలు పొందుతున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్, మెషిన్ లెర్నింగ్, ఎల్‌టీటీ, డ్రోన్స్ డిజైన్, మ్యానుఫ్యాక్చరింగ్‌తో సహా వివిధ కోర్సుల్లో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా బోధన అందిస్తున్నాం. ఇప్పటి వరకు 30 పరిశోధన ప్రాజెక్టులు వచ్చాయి. శ్యాంసంగ్ ల్యాబ్ ఏర్పాటు చేశాం.

– డాక్టర్ డీవీఎల్ఎన్ సోమయాజులు, ట్రిపుల్‌ఐ టీడీఎం డైరెక్టర్

మాటల్లో చెప్పలేని ఆనందం

మా అమ్మానాన్నలు కేవీ నరసింహ, ఉమా సుధలు వైజాగ్‌లోని ఇంజినీరింగ్ కాలేజీలో ప్రొఫెసర్లు. వారి ప్రోత్సాహంతో కష్టపడి చదివినందుకు ఫలితమే మూడు బంగారు పతకాలు. ఈ ఆనందం మాటల్లో చెప్పలేం. ఏడాదికి రూ.14 లక్షల వేతనంతో క్యాంపస్ సెలక్షన్స్‌లో సీడ్యాక్‌లో ఉద్యోగం వచ్చింది. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకొని సమాజ సేవ చేస్తా.

– మూడు బంగారు పతకాలు సాధించిన సాయిదీపిక లహరి, వైజాగ్

పీఎస్‌ల హేతుబద్ధీకరణకు ప్రతిపాదనలు పంపండి

- రాజకీయ పార్టీల ఫిర్యాదులపై క్షుణ్ణంగా విచారణ చేయాలి
- ఎన్నికల అధికారులకు కలెక్టర్ ఆదేశం



వీవీపాట్‌లను పరిశీలిస్తున్న కలెక్టర్ జి.సృజన

కర్నూలు(సెంట్రల్): పెరుగుతున్న ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు, ఉన్న వాటిని క్రమబద్ధీకరించేందుకు తగిన ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లందరూ ఒకే పోలింగ్ స్టేషన్‌లో ఉండేలా చూసుకోవాలన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణపై ఆమె రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుతం జిల్లాలో 2,184 పోలింగ్ స్టేషన్లు ఉండగా అదనంగా మరో రెండు స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు వచ్చాయన్నారు. అలాగే 112 స్టేషన్లకు సంబంధించి లోకేషన్ మార్పు, 336 స్టేషన్లకు సంబంధించి పేరు మార్పుపై ప్రతిపాదనలు వచ్చాయని రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఆమె వివరించారు. పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుపై రాజకీయ పార్టీలు తమ అభిప్రాయాలు, సూచనలు ఉంటే సంబంధిత ఈఆర్‌ఓలకు అందజేస్తే పరిశీలన చేస్తారని చెప్పారు. సాధ్యమైనంత వరకు అన్ని పోలింగ్‌స్టేషన్లను ప్రభుత్వ భవనాల్లోనే ఏర్పాటు చేస్తామన్నారు. వాటిలో ర్యాంపు, టాయిలెట్ విత్ రన్నింగ్ వాటర్, కరెంట్ ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆమె అధికారులకు సూచించారు. అలాగే ఎక్కడైనా పోలింగ్ స్టేషన్లు అవసరమవుతాయని అనిపిస్తే ప్రతిపాదనలు పంపాలని అధికారులకు సూచించారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌లో కనీసం 900–1500 వరకు ఓటర్లు ఓటు వేసేలా ఉండాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో మధుసూదన రావు, బీఎస్పీ నుంచి జి.అరుణ్‌కుమార్, బీజేపీ నుంచి నరసింహవర్మ, వైఎస్ఆర్‌సీపీ నుంచి అలీఖాన్, టీడీపీ నుంచి ఎల్‌వీ ప్రసాద్, కాంగ్రెస్ నుంచి డీసీసీ అధ్యక్షుడు ఎం.సుధాకరబాబు, సీపీఎం నుంచి ఎం.రాజశేఖర్, ఎన్నికల విభాగం అధికారి మురళీ పాల్గొన్నారు.

వీవీ ప్యాట్లకు కట్టుదిట్టమైన భద్రత

ఎన్నికల నిర్వహణలో ఎంతో కీలకమైన వీవీ పాట్‌లను కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య భద్రపరిచినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ జి.సృజన చెప్పారు. శనివారం ఆమె కలెక్టరేట్‌లోని ఈవీఎం గోదాములో భద్రపరిచిన వీవీ పాట్‌లను పరిశీలించారు. ఈనెల 30వ తేదీలోపు గోదాముకు ఈవీఎంలు కూడా వస్తాయన్నారు. అక్టోబర్ 20 నుంచి ఈవీఎంల ఫస్టు లెవల్ చెక్(ఎఫ్ఎల్‌సీ) చేయనున్నట్లు చెప్పారు. ఈవీఎం గోదాముకు సున్నం కొట్టించి వెలుతురు, గాలి బాగా వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ మురళీని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి నాగరాజునాయుడు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో జిల్లాకు పతకాలు



పతకాలు సాధించిన కర్నూలు అథ్లెటిక్స్ క్రీడాకారులు

కర్నూలు (టౌన్): గుంటూరు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ క్రీడా ప్రాంగణంలో ఈనెల 21 నుంచి 23 వరకు జరిగిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటారు. ఎస్. మహాలక్ష్మి (రేస్‌వాక్, ప్రథమస్థానం), సి. దేవి (400 మీటర్లు, ప్రథమస్థానం), మైత్రీ (అండర్-20 విభాగంలో హైజంప్, ద్వితీయ స్థానం), ఎం. సంధ్య (అండర్-18 విభాగంలో హైజంప్, తృతీయ స్థానం), భరత్ (10 వేల మీటర్ల రేస్ వాక్, ద్వితీయ స్థానం), షేక్షావలి (1500 మీటర్ల పరుగు, ప్రథమ స్థానం), బి. నరసింహులు (2 కి.మీ. నడక, ప్రథమస్థానం), వెంకటరామిరెడ్డి (2 కి.మీ ట్రిపుల్ ఛేజ్, ప్రథమ స్థానం), శ్రీ ప్రియ (అండర్-18 విభాగంలో 200 మీటర్ల పరుగు, తృతీయ స్థానం), మహేష్, దేవకుమార్, మంజూ, విక్రమ్ నాయక్ (మిడ్‌లే రిలే పరుగులో తృతీయ), ఎల్. మధుకావ్యారెడ్డి (100, 200 మీటర్ల పరుగులో, ద్వితీయ) పతకాలు సాధించారు. జిల్లాకు గుర్తింపు తెచ్చిన ఈ అథ్లెట్లను శనివారం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి సుబ్బరత్నాలు ప్రత్యేకంగా అభినందించారు

పోక్సో కేసు బాధితులకు పరిహారం



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్.శ్రీనివాసరావు

కర్నూలు(లీగల్): పోక్సో కేసు, లైంగిక వేధింపులు, ఇతర నేరాల్లో మహిళా బాధితులకు 'నల్సా' పరిహార పథకం-2018తో పరిహారం పొందవచ్చునని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్.శ్రీనివాసరావు అన్నారు. ఈ అంశంపై శనివారం జిల్లా న్యాయ సేవాసదన్‌లో వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ నల్సా పరిహార పథకంతో బాధిత మహిళలకు ప్రభుతవం పరిహారం అందిచేసి ఆసరాగా నిలుస్తుందన్నారు. 7వ అదనపు కోర్టు న్యాయమూర్తి జి.భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ పోక్సో కేసుల్లో బాధితులకు పునరావాసం కోసం నష్టపరిహారం పొందవచ్చునన్నారు. నష్టాన్ని, గాయాన్ని చవిచూసిన బాధితులు, చనిపోయిన వారిపై ఆధారపడిన వారి కుటుంబ సభ్యులకు ఈ చట్టం వర్తిస్తుందన్నారు. బాధితులు నష్టపరిహారం కోసం కోర్టులు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థలు, జిల్లా కలెక్టర్‌ల ద్వారా రాత పూర్వకంగా అర్జీ ద్వారా పొందే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో అదనపు జిల్లా జడ్జీలు పాండురంగారెడ్డి, సునిత, జూనియర్ సివిల్ జడ్జిలు టి.జ్యోత్స్న దేవి, బాబా ఫక్రుద్దిన్, కర్నూలు బార్ అసోసియేషన్ అధ్యక్షులు నాగభూషణం నాయుడు, నగరంలోని సీఐలు, ఎస్ఐలు, న్యాయవాదులు పాల్గొన్నారు.

సర్వే ఏడీగా మణికన్నన్

కర్నూలు(సెంట్రల్): సర్వే శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఎం.మణికన్నన్ నియమితులయ్యారు. ఈయన ప్రస్తుతం వైఎస్సార్ జిల్లాలోని జీఎస్ఎస్ఎస్‌లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్నారు. అక్కడి నుంచి కర్నూలు ఆర్‌డీఓ కార్యాలయ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ చేశారు. అనంతరం డిప్యూటేషన్‌పై సర్వే శాఖ ఏడీగా నియమించారు. కాగా ఇక్కడ ఏడీగా ఉన్న శ్రీరామమోహన్ అనారోగ్యంతో సెలవులో వెళ్లారు. ఆయన స్థానంలో డీఐగా ఉన్న సారథికి ఇన్‌చార్జి ఇచ్చారు. ఆయన కూడా యాక్టివ్‌గా లేకపోవడంతో ఈ నియామకాన్ని చేపట్టారు. సోమవారం ఎం.మణికన్నన్ బాధ్యతలు చేపట్టనున్నారు.

క్లుప్తంగా

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కర్నూలు: నగర శివారులోని డోన్ రూట్‌లో వెంగన్నబావి దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి కోలుకోలేక శనివారం మృతిచెందాడు. పర్ల గ్రామానికి చెందిన నరేష్ (35)కర్నూలు ఎన్ఆర్ పేటలో ఉంటూ స్వర్ణకారు వృత్తి ద్వారా జీవనం సాగిస్తున్నాడు. స్నేహితుడు రఘుతో కలసి ఈనెల 19న కర్నూలు నుంచి దూపాడు వైపు కారులో వెళ్తూ కట్టమంచి రామలింగారెడ్డి స్కూల్ దగ్గర యూటర్న్ తీసుకునే యత్నంలో కారు డివైడర్‌ను ఢీకొంది. దీంతో నరేష్‌తో పాటు అతని స్నేహితుడు రఘు కూడా గాయాలకు గురయ్యాడు. అయితే నరేష్ కోలుకోలేక మృతిచెందాడు. కర్నూలు అర్బన్ తాలూకా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

హంద్రీ నదిలో గుర్తు తెలియని మహిళ మృతదేహం



కర్నూలు: రాజ్‌విహార్ నుంచి కలెక్టరేట్ వైపు వచ్చే దారిలో బ్రిడ్జి కింద హంద్రీ నదిలో అనుమానాస్పద స్థితిలో చనిపోయి ఉన్న గుర్తు తెలియని మహిళ మృతదేహం బయటపడింది. శనివారం ఉదయం స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు 34వ వార్డు రెవెన్యూ సెక్రటరీ (హబీబ్ ముబారక్ నగర్) సుచరిత ఫిర్యాదు మేరకు మూడో పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని నీటిలో పడివున్న మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సుమారు 40 సంవత్సరాల వయస్సు ఉండి, నలుపు చుక్కల డిజైన్ కలిగిన నైటీ ధరించింది. మూడో పట్టణ సీఐ మురళీధర్‌రెడ్డి తన సిబ్బందితో అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కేంద్రానికి తరలించి వాహన రాకపోకలు యథావిధిగా జరిగేందుకు చర్యలు చేపట్టారు. ఆచూకీ తెలిసినవారు 91211 01061కు సమాచారం అందజేయాలని సీఐ కోరారు.

లారీ, బైక్ ఢీకొని ఇద్దరి దుర్మరణం


మృతుడు హుస్సేన్ బాషా

ఓబులవారిపల్లె: మంగంపేట జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం లారీ, బైక్ ఢీకొనడంతో ఇద్దరు దుర్మరణం చెందగా, మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా.. తమిళనాడు నుంచి కర్ణాటకకు వెళ్తున్న లారీ మంగంపేట జాతీయ రహదారిపై గుట్ట దిగువ వైపు వేగంగా వస్తుండటంతో.. రైల్వేకోడూరు వైపు వెళ్తున్న బైక్‌ను ఢీకొని అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో లారీ డ్రైవర్ ముత్తుస్వామి(40) క్యాబిన్‌లోనే ఇరుక్కుపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్‌పై వెళ్తున్న హుస్సేన్ బాషా(35) కాలు విరిగిపోయి తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మరణించాడు. మరో వ్యక్తి నరేంద్ర పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తరలించారు. హుస్సేన్ బాషా స్వస్థలం కర్నూలు జిల్లా ఆదోని. కొన్ని నెలలుగా రైల్వేకోడూరులోని సమతానగర్‌లో నివాసం ఉంటున్నాడు. మంగంపేట పరిసర ప్రాంతాల్లో సెంట్రింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రోజూలాగే శనివారం సాయంత్రం పనులు పూర్తి చేసుకొని స్నేహితుడు నరేంద్రతో కలిసి రైల్వేకోడూరుకు బైక్‌పై బయలుదేరాడు. మంగంపేట జాతీయ రహదారిపై గుట్ట ఎక్కుతుండగా లారీ ఢీకొన్న ప్రమాదంలో మృతి చెందాడు. మృతునికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

'వందే భారత్'కు స్వాగతం!

- నేడు పట్టాలెక్కనున్న వందేభారత్ రైలు
- కాచిగూడ- కర్నూలు- బెంగుళూరు మధ్య రాకపోకలు
- బుధవారం మినహా అన్ని రోజుల్లో నడిచేలా చర్యలు
- జెండా ఊపి ప్రారంభించనున్న పీఎం మోదీ
- తెలంగాణ, ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాలు చుట్టేయనున్న కొత్త రైలు
- గంటకు 160 కిలో మీటర్ల వేగంతో పరుగులు.. తగ్గనున్న ప్రయాణ సమయం
- చార్జీల వివరాలు విడుదల చేసిన దక్షిణ మధ్య రైల్వే


ట్రయల్ రన్‌లో భాగంగా కర్నూలు చేరిన వందే భారత్ రైలు (ఫైల్)


రైలులో ఆధునిక మరుగుదొడ్డి

కర్నూలు(రాజ్‌విహార్): 'వందే భారత్' రైలు వచ్చేస్తోంది. మూడు నెలలుగా జిల్లా ప్రజలకు ఊరిస్తున్న ఈ సూపర్ ఫాస్ట్ ట్రైన్ ఆదివారం నుంచి పట్టాలు ఎక్కనుంది. భారత రైల్వే శాఖ రూపొందించిన ఈ వందే భారత్ రైలు నిర్వహణకు రైల్వే బోర్డు అన్ని అనుమతులు జారీ చేయడంతో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ జెండా ఊపి ప్రారంభించనున్నారు. దేశ వ్యాప్తంగా తొమ్మిది వందే భారత్ రైళ్లను ప్రారంభిస్తుండగా అందులో కర్నూలు మీదుగా రాకపోకలు సాగించే కాచిగూడ (హైదరాబాదు) స్టేషన్ - యశ్వంత్‌పూర్ (బెంగుళూరు) రైలు కూడా ఉంది.ఈ నూతన రైలు తెలంగాణ, అంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలు చుట్టేస్తూ ప్రయాణికులను శరవేగంగా గమ్యాన్ని చేర్చనుంది.

నెలన్నరగా ట్రయల్ రన్

కాచిగూడ - యశ్వంత్‌పూర్ రూటులో వందే భారత్ రైలు నడిపేందుకు మూడు నెలల క్రితం అనుమతి మంజూరు చేశారు. అయితే, పాలన, నిర్వహణ, ఆన్‌లైన్ పర అనుమతుల రావడంలో కొంత జాప్యమైంది. అయినా, అధికారులు మాత్రం నెలన్నర క్రితం నుంచే వందేభారత్ రైలు ట్రయల్ రన్ చేపడుతూ వచ్చారు. అత్యంత వేగంగా నడిచే ఈ రైలు రాకపోకల వేళ ఏవైనా సమస్యలు తలెత్తే అవకాశం ఉందా అని పరిశీలించారు. అది కూడా రూటు మొత్తం ఒకే సారి కాకుండా పార్ట్ పార్ట్‌లుగా అధ్యాయం చేశారు. ఆగస్టు 9న కర్నూలు-డోన్ మధ్య ట్రయల్ రన్‌ను విజయవంతంగా నిర్వహించారు.

12:30 గంటలకు ప్రారంభోత్సవం

ప్రధాన మంతి నరేంద్రమోదీ దేశ వ్యాప్తంగా ఆదివారం మధ్యాహ్నం 12.30 గంటలకు 9 వందేభారత్ రైళ్లను వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. కాచిగూడ - యశ్వంత్‌పూర్ రైలు వెంటనే కాచిగూడ స్టేషన్ నుంచి బయలుదేరి కర్నూలుకు సాయంత్రం 4:15 గంటలకు చేరుకోనుంది. ఈ సందర్భంగా స్థానిక అధికారులు కర్నూలు సిటీ స్టేషన్‌లో మధ్యాహ్నం 3:15 గంటలకు ప్రారంభోత్సవ కార్యక్రమం ఏర్పాటు చేశారు.

గంటకు 160 కిలో మీటర్ల వరకు వేగం

ఈ రైలు వేగాన్ని నాలుగు విభాగాలుగా విభజించారు. ఎలక్ట్రిఫికేషన్ ట్రాక్, నాన్ ఎలక్ట్రిఫికేషన్ పట్టాలు, డబుల్ ట్రాక్, సింగిల్ ట్రాక్‌లను పరిగణలోకి తీసుకొని వేగం ఉంటోంది. గంటకు 160 కిలో మీటర్ల వేగంతో పరుగుతీసే సామర్థ్యం ఉన్నా.. మొత్తం 609.81 కిలో మీటర్ల పొడవైన కాచిగూడ-యశ్వంత్‌పూర్ రూటులో సగటున గంటలకు 71.74 కిలో మీటర్ల వేగంతో 8:30 గంటల్లో గమ్యస్థానానికి చేరనుంది. ఇతర రైళ్లతో పోల్చితే ప్రయాణ సమయం 2.50 గంటలు తగ్గనుంది.

బుధవారం మినహా అన్ని రోజుల్లో ...

ఈ రైలు బుధవారం మినహా అన్ని రోజుల్లో కాచిగూడ నుంచి కర్నూలు మీదుగా యశ్వంత్‌పూర్‌కు రాకపోకలు సాగించనుంది. సిటీ స్టేషన్‌లో ఒక నిమిషం మాత్రమే నిలిపేందుకు అనుమతి ఇవ్వగా డోన్‌కు స్టాపింగ్ ఇవ్వలేదు. ప్రారంభోత్సవం రోజు మినహా మిగిలిన రోజుల్లో కాచిగూడ నుంచి ఉదయం 5:30 గంటలకు బయలుదేరే ఈ రైలు (నంబర్ 20703) మహబూబ్ నగర్‌కు 6:59కి, కర్నూలు సిటీ స్టేషన్‌కు 8:39కి, అనంతపురానికి 10:54కి, ధర్మవరానికి 11:25కి, యశ్వంత్‌పుర్‌కు మధ్యాహ్నం 2 గంటలకు చేరుకుంటుంది. తిరిగి అక్కడి నుంచి మధ్యాహ్నం 2:45 గంటలకు బయలుదేరే ఈ రైలు (నంబర్ 20704) ధర్మవరానికి సాయంత్రం 5:15కి, అనంతపురానికి 5:40కి, కర్నూలు సిటీ స్టేషన్‌కు 7:50కి, మహబూబ్ నగర్‌కు 9:45కి, కాచిగూడకు 11:15గంటలకు చేరుకుంటుంది.

చార్జీలు ఇలా..

రైలు మొత్తం రిజర్వేషన్ సీట్లు కలిగి ఉంది. జనరల్, సెకండ్ క్లాస్ బోగీలు లేవు. 8 బోగీలు ఉన్న ఇందులో ఒకటి ఎగ్జిక్యూటివ్ చైర్ కార్ కోచ్, ఏడు ఏసీ చైర్ కార్ కోచ్‌లు ఉన్నాయి. ఇందులో బేసిక్ చార్జీలతో పాటు రిజర్వేషన్, సూపర్‌ఫాస్టు, జీఎస్‌టీ, డబ్ల్యూబీ అండ్ ఎస్ఎస్, క్యాటర్నింగ్ చార్జీలు (అప్షనల్) కలిపి ఉన్నాయి.

చార్జీల పట్టిక (క్యాటర్నింగ్ చార్జీలతో కలిపి)

నుంచి	వరకు	చైర్ కార్	ఎగ్జిక్యూటివ్ చైర్ కార్
కర్నూలు	మహబూబ్ నగర్	రూ.610	రూ.1,110
కర్నూలు	కాచిగూడ	రూ.795	రూ.1,480
కర్నూలు	అనంతపురం	రూ.670	రూ.1,235
కర్నూలు	ధర్మవరం	రూ.725	రూ.1,335
కర్నూలు	యశ్వంత్‌పూర్	రూ.1,230	రూ.2,160


చైర్‌కార్ కోచ్


ఎగ్జిక్యూటివ్ చైర్ కార్ కోచ్

పలు మండలాల్లో వర్షం


అలుగు ఎక్కి పారుతున్న ఉయ్యాలవాడ మండలం రూపన గుడి చెరువు

నంద్యాల(సెంట్రల్): జిల్లా వ్యాప్తంగా శనివారం పలు మండలాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురవగా శనివారం కూడా పలు చోట్ల వర్షాలు పడటంతో రైతులు ఊరట చెందుతున్నారు. అత్యధికంగా ఉయ్యాలవాడలో 65.2 మి.మీ, అత్యల్పంగా కొలిమిగుండ్లలో 0.6 మి.మీల వర్షం కురిసింది. ఆళ్లగడ్డ 60.0 మి.మీ, రుద్రవరం 40.2, చాగలమర్రి 39.2, ఆత్మకూరు 3.8, దొర్నిపాడు-2.2, వెలుగోడు 1.8, శిరివెళ్ల-1.2 మి.మీ వర్షపాతం నమోదైంది. రుద్రవరం మండలం ఆర్.నాగులవరం మలుపు వద్ద ఉన్న పెద్ద వంక ఉప్పొంగి ఆర్ అండ్‌బీ రోడ్డుపై ప్రవహించడంతో కాసేపు రాకపోకలు నిలిచి పోయాయి. మండల కేంద్రం ఉయ్యాలవాడ బీసీ కాలనీ, జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణ, బస్టాండు ఆవరణం జలమయ్యమయ్యాయి. రూపనగుడి చెరువు అలుగు ఎక్కి పారుతోంది.

మహిళ దారుణ హత్య

- ఆలస్యంగా వెలుగుచూసిన ఘటన
- హతురాలిది రుద్రవరం గ్రామం


హత్యకు గురైన మంటి తిరుపతమ్మ

బేతంచెర్ల: పట్టణంలోని పోలీస్ స్టేషన్ సమీపంలో ఓ మహిళ హత్యకు గురైంది. హతురాలు మండల పరిధిలోని రుద్రవరం గ్రామానికి చెందిన మంటి తిరుపతమ్మ. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ ఘటన వివరాలు.. మంటి తిరుపతమ్మ (45) దాదాపు 12 ఏళ్లుగా స్థానిక పోలీస్ స్టేషన్‌లో స్వీపర్‌గా పని చేస్తూ జీవనం కొనసాగించేది. వివిధ కారణాలతో గత మూడు నెలల నుంచి ఆమె పనికి వెళ్లడం లేదు. రెండు రోజుల నుంచి ఇంట్లో కూడా లేదు. పోలీస్ స్టేషన్ సమీపంలో నూతన బిల్డింగ్ నిర్మాణం జరుగుతుంది. శనివారం ఉదయం పనికి వచ్చిన భవన నిర్మాణ కార్మికులు భవనం వెనుక దుర్వాసన వస్తుండటంతో వెళ్లి చూశారు. అక్కడ మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. బనగానపల్లె సీఐ తిమ్మారెడ్డి, బేతంచెర్ల ఎస్ఐ శివ శంకర్ నాయక్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతురాలి తలపై బలమైన రక్త గాయం ఉంది. జాగిలాలతో చుట్టుపక్కల పరిసరాలు గాలించిన పోలీసులు తర్వాత మృత దేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం బనగానపల్లె ఆసుపత్రికి తరలించారు. హత్య చేసి ఉంటారని కుటుంబసభ్యుల అనుమానం వ్యక్తం చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తిమ్మారెడ్డి, ఎస్ఐ శివ శంకర్ నాయక్ తెలిపారు. తిరుపతమ్మకు ముగ్గురు కుమార్తెలు సంతానం. పోలీస్ స్టేషన్‌కు కూత వేటు దూరంలో మహిళ దారుణ హత్యకు గురికావడం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.

రేపు కలెక్టరేట్‌లో స్పందన

కర్నూలు(సెంట్రల్): కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి వినతులను స్వీకరించనున్నట్లు కలెక్టర్ డాక్టర్ జి.సృజన శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి 2 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. జిల్లా కేంద్రంతోపాటు అన్ని మండల, డివిజన్, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

కాన్వొకేషన్ దరఖాస్తు గడువు పొడిగింపు

కర్నూలు(న్యూసిటీ): రాయలసీమ విశ్వవిద్యాలయంలో నాల్గవ కాన్వొకేషన్ దరఖాస్తు గడువును ఈ నెల 30వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు ఉపకులపతి ఆచార్య ఎ.ఆనందరావు తెలిపారు. ఇంతవరకు దరఖాస్తు చేయని విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన సూచించారు. ఆర్‌యూ పరిధిలోని కర్నూలు, నంద్యాల జిల్లాల్లో అక్టోబర్ 3 నుంచి బీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయని వర్సిటీ అధికారులు తెలిపారు.

2,534 హెక్టార్లకు సూక్ష్మసేద్యం మంజూరు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో సూక్ష్మ సేద్యం మంజూరు ప్రక్రియను ఏపీఎంఐపీ వేగవంతం చేసింది. వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో సూక్ష్మ సేద్యానికి మరింత ఆదరణ పెరిగింది. అర్హత, అవసరం ఉన్న రైతులకు ఎలాంటి జాప్యం లేకుండా సూక్ష్మ సేద్యం మంజూరు చేయడంతో పాటు పైపులు, ఇతర పరికరాలు సరఫరా చేస్తున్నట్లు ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ ఉమాదేవి తెలిపారు. 2023-24 సంవత్సరానికి 5వేల హెక్టార్లకు సూక్ష్మ సేద్యం కల్పించాలనేది లక్ష్యం కాగా.. 9,885 హెక్టార్లకు రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. 5,025 హెక్టార్లకు ఎస్టిమేట్లు పూర్తయ్యాయని, 2,639 హెక్టార్లకు రైతులు నాన్ సబ్సిడీ కూడా చెల్లించారన్నారు.అక్టోబర్ నెల చివరి నాటికి లక్ష్యాలను పూర్తి చేస్తామని తెలిపారు.

నూతన ఈఓ రేపు బాధ్యతల స్వీకరణ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానానికి నూతన ఈఓగా నియమితులైన డి.పెద్దిరాజు సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఏడాది పాటు డిప్యుటేషన్ కింద నియమిస్తూ దేవాదాయ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి కరికాల వలవన్ శనివారం జీఓ జారీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 5న ప్రస్తుత ఈఓ లవన్నను బదిలీ చేసింది. ఆయన స్థానంలో కడప డిప్యూటి కలెక్టర్ డి.పెద్దిరాజును శ్రీశైలం ఈఓ గా నియమించింది. ఈ నెల 7న పెద్దిరాజు దేవదాయశాఖలో రిపోర్టు సమర్పించారు. ఈ నేపథ్యంలో శ్రీశైలం ఈఓగా ఏడాది పాటు డిప్యుటేషన్ కింద నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రణాళికతో ఆరోగ్య సురక్ష క్యాంపులు

- వైద్య సేవలపై విస్తృత ప్రచారం కల్పించండి
- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

నంద్యాల: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈనెల 30వ తేదీ నుంచి చేపట్టే జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపుల నిర్వహణకు పటిష్ట ప్రణాళిక రూపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ వైద్యాధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపు నిర్వహణపై అన్ని ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 369 విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, 16 అర్బన్ హెల్త్ క్లినిక్‌లు ఇతర ఆరోగ్య కేంద్రాల పరిధిలో నిర్వహించే జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపుల్లో ఎలాంటి లోపాలకు తావివ్వకుండా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. సచివాలయ ఆరోగ్య కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు, వలంటీర్ సహకారంతో ఇంటి ఇంటి సర్వే నిర్వహించి జగనన్న ఆరోగ్య సురక్ష టోకెన్‌లు తప్పనిసరిగా పంపిణీ చేయాలన్నారు. క్యాంపుల ద్వారా అందించే వైద్య సేవలపై ప్రజల్లో విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. ఇంటింటి సర్వేలో సాధారణ వ్యాధులతో పాటు దీర్ఘకాలిక వ్యాధులు, గర్భిణులు, బాలింతలు తగిన బరువు లేని పిల్లలను గుర్తించి వైద్య శిబిరానికి తరలించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైన మలేరియా, డెంగీ ఇతర టెస్టింగ్ కిట్లను, మందుబిల్లలను ముందుగానే అందజేయాలన్నారు. ప్రతి ఆరోగ్య శిబిరంలో ఇద్దరు వైద్యాధికారులు, ఇద్దరు స్పెషలిస్ట్ డాక్టర్లు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే హెచ్‌బీ పరీక్షలు, షుగర్ పరీక్షలు, బీపీ పరీక్షలు, గళ్ల పరీక్షలు తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. ప్రతి ఆరోగ్య శిబిరాన్ని ఎంపీడీఓలు, తహసీల్దార్లు ప్రవేశించి పర్యవేక్షించి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ వెంకటరమణ, డీసీహెచ్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ జఫ్రుల్లా, జిల్లా పరిషత్ సీఈఓ సుబ్బారెడ్డి, ఆరోగ్యశ్రీ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ రూపేంద్రనాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.